ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
5
ములుగు
మంగళవారం 25 జూన్ 2024

- ఒకేసారి రూ.2లక్షల మాఫీకి ప్రభుత్వం కసరత్తు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- ఆగస్టు 15వ తేదీలోపు రైతులకు చెల్లించేందుకు ప్రణాళిక
- అర్హతలపై మార్గదర్శకాలు రూపొందిస్తున్న సర్కారు
- పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం విధివిధానాలపై అధ్యయనం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8.90లక్షల మందికి రైతుబంధు పథకం
- 3.82లక్షల మందికి సమ్మాన్ నిధి ద్వారా పెట్టుబడి సాయం
- రుణమాఫీకి సుమారు రూ.8వేల కోట్లు అవసరంగా అంచనా

రుణమాఫీ.. రైతు ఖుషీ



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రైతు రుణమాఫీపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పంద్రాగస్టులోపు రైతులకు రూ.2లక్షల రుణాన్ని ఒకే విడతలో మాఫీ చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రైతు రుణమాఫీపై హామీ ఇచ్చింది. దీంతో ఉమ్మడి వరంగల్‌లో సుమారు 8లక్షల మంది రైతులకు సుమారు రూ.8వేల కోట్ల వరకు రుణమాఫీ జరుగవచ్చునని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అయితే రుణమాఫీని ఎలా చేయాలనే దానిపై మార్గదర్శకాలు రూపొందించేందుకు ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకేఎస్) పథకంలోని విధివిధానాలపై అధ్యయనం చేస్తున్నారు. కొన్ని మార్పులు, చేర్పులతో అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుండటంతో ఓరుగల్లు అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డిసెంబరు 9వ తేదీ కటాఫ్

ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీకి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పంద్రాగస్టులోపు పక్కాగారూ.2లక్షల రుణమాఫీ చేయాలనే పట్టుదలతో ప్రభుత్వం ఉంది. దీనిపై ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మంత్రిమండలి ఉపసంఘాన్ని కూడా నియమించారు. ఉపసంఘానికి రుణమాఫీపై పలువురు నుంచి పలు ప్రతిపాదనలు వస్తున్నాయి. అలాగే రూ.2లక్షల రుణమాఫీకి 2018 డిసెంబరు 12వ తేదీ నుంచి 2023 డిసెంబరు 9వ తేదీని కటాఫ్‌గా నిర్ణయించారు. ఈ మధ్యకాలంలో రుణం తీసుకున్న రైతులకే రుణమాఫీ చేయనున్నారు. ఈ ఐదేళ్లలో రైతులు తీసుకున్న రుణంపై వడ్డీని కూడా లెక్కించి మొత్తంగా రూ.2లక్షల వరకు మాఫీ చేయనున్నారు. ఆపైన ఉన్న మొత్తాన్ని రైతులే బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. గోల్డ్ లోనులను మాత్రం ఎట్టి పరిస్థితుల్లో మాఫీ చేసే అవకాశం లేదని సమాచారం.

విధివిధానాలపై ప్రభుత్వం కసరత్తు

పంద్రాగస్టులోపు రుణమాఫీ చేయాలని తీవ్ర కసరత్తు చేస్తున్న సర్కారు.. ఎవరికి వర్తింపజేయాలనే దానిపై తర్జనభర్జన పడుతోంది. వివిధ వర్గాల నుంచి ప్రభుత్వానికి పలు ప్రతిపాదనాలు వస్తుండగా.. ప్రధానంగా ఆదాయపన్ను చెల్లిస్తున్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కూడా రుణమాఫీ నుంచి తొలగించే అవకాశాలున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఐదెకరాల రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తింపజేయాలనే ప్రతిపాదనలు కూడా వస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం విధివిధానాలపైనా అధ్యయనం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. పూర్తి విధివిధానాలను కాకపోయినా కొన్నిటిని అయినా పరిగణనలోకి తీసుకుంటునే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. మరో వైపు తెల్ల రేషన్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకాలను ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని కూడా ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. ఒక ఇంట్లో ఒక్కరికే రుణమాఫీ వర్తిస్తుందని ప్రచారం జరుగుతుండగా.. ఇందుకోసం రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులను ప్రామాణికంగా తీసుకోవాలని నిర్ణయించినట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

వివరాల సేకరణలో అధికారులు

కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే రుణమాఫీకి అడుగులు వేస్తుండటంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అయితే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం విధివిధానాలను పరిగణనలోకి తీసుకుంటే చాలా తక్కువ మందికి రుణమాఫీ జరుగుతుందని, అదే రైతుబంధు విధివిధానాలైతే అత్యధిక రైతులకు ప్రయోజనం చేకూరుతుందని లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 3,81,890 మంది రైతులు లబ్ధిపొందుతుండగా వీరికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ.76,37,80,000 పెట్టుబడి సాయాన్ని అందించింది. అదే రైతు బంధు పథకం కింద అయితే 8,89,787మంది రైతులకు రూ.907.93కోట్ల సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ క్రమంలో రైతుబంధు విధివిధానాలను కొంచెం మార్పులు, చేర్పులు చేసి అమలు చేస్తే ఉమ్మడి జిల్లాలో 8,89,787మంది రైతులు లబ్ధిపొందుతారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీరికి సుమారు రూ.8వేల కోట్ల వరకు రుణమాఫీ జరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సహకార బ్యాంకులతో పాటు జాతీయ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 34 సహకార బ్యాంకుల్లో 78,432మంది రైతులకు రూ.529.44కోట్ల రుణమాఫీ కానుండగా ఇప్పటికే డీసీసీబీ బ్యాంకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అలాగే జాతీయ బ్యాంకుల్లో కూడా వివరాలను సేకరిస్తుండగా.. త్వరలోనే రూ.2లక్షల రుణమాఫీ లబ్ధిదారుల లెక్క తేలనుంది.

అన్నదాతల్లో ఆనందం

వానాకాలం సాగు ప్రారంభం కావటంతో ఇటీవల కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3,81,890మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.76కోట్ల37లక్షల80వేల రుపాయలను జమ చేసింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పెట్టుబడి సాయాన్ని కూడా పెంచబోతోంది. జూలై మొదటి వారంలో వానాకాలం పెట్టుబడి సాయం అందించనుంది. గత ప్రభుత్వం ఎకరానికి రూ.5వేల చొప్పున వానాకాలం, యాసంగి పంటలకు రూ.పదివేల అందించింది. అయితే తాము అధికారంలోకి వస్తే రూ.15వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలసిందే. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పెట్టుబడి సాయం ఎకరానికి రూ.15వేలు అందనుంది. జూలైలో ఈ సాయాన్ని రైతుల ఖాతాలో వేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. 2023-24 యాసింగిలో రైతుబంధు పథకం కింద ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,89,787మంది రైతులకు రూ.907.93కోట్ల నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఈసారి ఈ మొత్తం రూ.1,350కోట్లకు పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. మొత్తానికి రూ.2లక్షల రుణమాఫీతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం పెరుగుతుండటంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో రైతుబంధు, పీఎం కిసాన్‌సమ్మాన్ నిధి ద్వారా లబ్ధిపొందుతున్న రైతుల వివరాలు

జిలా	రైతుబంధు	పెట్టుబడి సాయం	పీఎంకేఎస్	పెట్టుబడి సాయం
వరంగల్	1,54,822	రూ.137.46కోట్లు	65,361	రూ.13,07,22,000
హనుమకొండ	1,45,044	రూ.132.13కోట్లు	56,409	రూ.11,28,18,000
జనగామ	1,79,735	రూ.202.04కోట్లు	81,487	రూ.16,29,74,000
మహ-బాద్	2,14,685	రూ.233.07కోట్లు	90,978	రూ.18,19,56,000
భూపాలపలి	1,16,171	రూ.118.83కోట్లు	48,496	రూ.09,69,92,000
ములుగు	79,330	రూ.84.40కోట్లు	39,159	రూ.07,83,18,000
మొత్తం	8,89,787	రూ.907.93కోట్లు	3,81,890	రూ.76,37,80,000

ప్రజావాణి వినతులపై
సత్వరమే స్పందించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజావాణిలో బాధితురాలి సమస్యను వింటున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 24: ప్రజావాణి వినతులపై సత్వరమే స్పందించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. భూపాలపల్లి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మొదటిసారి సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి వినతులకు ప్రాధాన్యత ఇచ్చి తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. దరఖాస్తుదారులకు తమ సమస్య పరిష్కారానికి సంబంధించిన కచ్చితమైన సమాచారం అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ప్రజావాణిలో జిల్లాకు సంబంధించిన దరఖాస్తులను వారం రోజు ల్లో పరిష్కరించి పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కరంకు అన్ని శాఖల అధికారులు వారివారి కార్యాలయాల్లో ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించుకోవాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 25 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీవో నారాయణరావు, డీఎంహెచ్‌వో మధుసూదన్, జడ్పీ సీఈఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యల పరిష్కారానికి కృషి

ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర



ప్రజావాణిలో ప్రజల సమస్యలను వింటున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జూన్ 24: వివిధ సమస్యలపై ప్రజలు ప్రజావాణిలో సమర్పిస్తున్న దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సమావేశపు హాల్‌లో ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి 45దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని, ఎవరూ అధైర్యపడవద్దని అన్నారు. జిల్లా పరిపాలన గ్రామస్థాయి వరకు చేరడంలో పంచాయతీరాజ్‌శాఖ కీలక పాత్ర పోషిస్తుందని, ఆ శాఖ ఉద్యోగులు సమన్వయంతో విధు లు నిర్వర్తించాలని అన్నారు. వరదల నేపథ్యంలో అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో జిల్లాకు రెండు బోట్లు వచ్చాయని, వాటిని వెంటనే పరీక్షించి ట్రయల్‌రన్ నిర్వహించాలని ఆశాఖ అధికారులను, రహదారుల పరిస్థితులు, వాటి స్థితిగతులపై నివేదిక సమర్పించాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, సీహెచ్.మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఆర్డీవో శ్రీనివాస్‌కుమార్, డీఎంహెచ్‌వో అప్ప య్య, డీఈవో పాణిని, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనిన, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చంద్ర, సివిల్‌సప్లయ్ మేనేజర్ రాంపతి, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, డీసీవో సర్దార్‌సింగ్, మైనారిటీశాఖ అధికారి ప్రేమలత, ఎల్‌డీఎం రాజ్‌కుమార్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

దేవదాయశాఖ భూములకు కౌలు వేలం పాటలు

మంగపేట, జూన్ 23: మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానానికి చెందిన ఆలయ పట్టా భూములు గ్రామాల వారిగా బహిరంగ వేలం ద్వారా ఒక సంవత్సరం కౌలుకు ఇచ్చేందుకు ఈనెల 29న, గ్రామాల్లోనే బహిరంగ వేలం పాటలు నిర్వహించడం జరుగుతుందని దేవస్థానం ఇన్‌చార్జి ఈవో ఎస్. మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 29న, ఉదయం 11 గంటలకు తాడ్వాయి మండలంలోని కాటాపురంలో గల భూమికి గంగారం గ్రామ పంచాయతీ వద్ద, మధ్యాహ్నం 2 గంటలకు ఏటూరునాగారం మండలంలోని శంకరాజుపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జూన్ 24: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం పట్టణంలోని మహిళా సంఘాల భవనాన్ని మెప్మా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా, ఉద్యోగ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. ఇందులో భాగంగానే విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం తాను స్వయంగా రూ.3.50కోట్లు మంజూరు చేశానని తెలిపారు. ప్రతీ గ్రామంలో మహిళలకు భవనం ఉండాలని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడం కోసం వారికి ప్రత్యేక రాయితీలతో మీ సేవా కేంద్రాలు, ఇతర చిన్న పరిశ్రమలు, సోలార్ సిస్టం పరిశ్రమను నెలకొల్పే యోచనలో ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి, కమిషనర్ రాజేశ్వర్, మెప్మా పీడీ రాజేశ్వరి, కౌన్సిలర్లు రవీందర్, నారాయణ, సరళ శ్రీనివాస్, నాయకులు బుర్ర కుమారస్వామి, సాంబమూర్తి, దేవన్, తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ గుట్టపై ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు

చిట్యాల: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను నెరవేరుస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని గిద్దెముత్తారం నుంచి కాల్వపల్లి వరకు రూ. 2కోట్లతో నిర్మించిన రహదారిని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. గతానికి భిన్నంగా మహిళా సంఘాలకు పాఠశాలల్లో భాగస్వాములను చేసి సెలవుల్లో పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించామన్నారు. ఈప్రాంత విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఘనపురం మండలం గాంధీనగర్ గుట్టపై ఎడ్యుకేషన్ హబ్‌ను త్వరలోనే నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, టేకుమట్ల జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ పప్పుల విజయలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు పులి సునీత అంజిరెడ్డి, పొలవేని పోశాలు, పీఆర్ డీఈలు వెంకటేశ్వర్లు, రవికుమార్, ఏఈ తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మూల శంకర్, ఎంపీటీసీ దబ్బెట అనీల్, విజేందర్‌రెడ్డి, సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

- గణపురం: మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సత్యనారాయణరావు శంకుస్థాపన చేశారు. గాంధీనగర్‌లో రూ. 10లక్షలతో కమ్యూనిటీహాల్, మైలారంలో రూ. 50లక్షలతో అంతర్గత రోడ్లు, రూ. 9లక్షలతో నిర్మించిన కల్వర్టును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, వైస్ ఎంపీపీ అశోక్, పీఏసీఎస్ ఛైర్మన్ కుమార్, కోఆప్షన్ సభ్యుడు చోటేమియా, జోడుప్రదీప్ తదితరులు ఉన్నారు.



భూపాలపల్లిలో మహిళా సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

- మొగుళ్లపల్లి: గ్రామాలాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఐదేళ్లలో మండలంలోని ప్రతీ గ్రామంలో అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండలంలోని మొట్లపల్లిలో రూ.25లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, పరకాల ఆర్టీసీ డిపో నుంచి మొట్లపల్లి వరకు బస్సు సర్వీసును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో ప్రతీ గ్రామాన్ని అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళతానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కటంగూరి రామనరసింహారెడ్డి, ఎర్రబెల్లి పున్నంచందర్, నరహరి, బక్కిరెడ్డి, రఘుపతిరెడ్డి, ఎమ్డీ.రఫీ, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా



ఐటీడీఏలో జరిగిన గిరిజన దర్బార్‌లో పీవోకు వినతి పత్రం అందిస్తున్న గిరిజనుడు

ఏటూరునాగారం రూరల్, జూన్24: గిరిజన దర్బార్‌లో గిరిజనుల సమస్యలపై వస్తున్న వినతులను సత్వరమే పరిష్కరించి వారికి మెరుగైన సేవలందించేందుకు సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్ నిర్వహించి గిరిజనుల వద్ద నుంచి పీవో వినతులు స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 75 మంది గిరిజనులు తమ గోడును పీవోకు విన్నవించారు. గ్రామంలో సీసీ రోడ్లు మంజూరు చేయాలని కొత్తగూడ మండలం ముస్మి గ్రామానికి చెందిన దేవేందర్ పీవోకు వినతి పత్రం అందించారు. ఆశ్రమ పాఠశాలలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, అందుకు సంబంధించిన బిల్లులు చెల్లించాలని వెంకటాపూర్ మండలానికి చెందిన కాంట్రాక్టర్ గండం తిరుపతి పీవోకు మొర పెట్టుకున్నారు. ఆర్వోఎఫ్ఆర్ ఎఫ్ఆర్సీ ద్వారా 100 మంది గిరిజన కుటుంబాలకు ఇంటిస్థలాలు కేటాయించాలని ఏటూరు నాగారం మండలం శంకరాజుపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు బొల్లె సమ్మయ్య, గడ్డం బాబు, చింత నాగేశ్వర్‌రావు పీవోను కోరారు. అదేవిధంగా పోడుభూములకు పట్టాలివ్వాలని వాజేడు మండలం గుమ్మడి దొడ్డి గ్రామానికి చెందిన పాయం కనకయ్య పీవోకు వినతి పత్రం అందించారు. ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్ట్ ప్రతిపాదికన వర్కర్‌గా ఉద్యోగ అవకాశం కల్పించాలని శాయంపేట మండలం కాత్రపల్లి గ్రామానికి చెందిన మొట్లపల్లి వసంత పీవోకు వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమంలో డీడీ పోచం, ఏవో దామోదరస్వామి, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున లక్నవరం

- తూములో కూలిన రాళ్లు
- మరమ్మతులు చేయిస్తున్న నీటిపారుదల శాఖ
- సనాతన పద్ధతిలో డంగు సున్నం, కరక్కాయ, బెల్లం వినియోగం
- డెడ్ స్టోరేజీకి చేరిన నీటిమట్టం
- 25న రాష్ట్రస్థాయి పరిశీలన బృందం రాక





లక్నవరం సరస్సు (ఫైల్), లక్నవరం తూముకు మరమ్మతు చేస్తున్న దృశ్యం

వివరాలు 7వ పేజీలో..

బాధితులకు సత్వర న్యాయం అందించాలి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కిరణ్‌ఖరే

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 24: వివిధ సమస్యల నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు చట్ట ప్రకారం సత్వర న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాదివస్ కార్యక్రమంలో భాగంగా వివిధ మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఆయన దరఖాస్తులను స్వీకరించారు. ఓపిగ్గా బాధితుల సమస్యలను తెలుసుకుని ఆయా ఠాణాల పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రతీ ఫిర్యాదుపై విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం చేయాలని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తంగా 15 మంది బాధితులు వారివారి సమస్యలపై ఎస్పీకి దరఖాస్తులు అందజేశారు.

ఎర్ర చెరువు వద్ద జాయింట్ సర్వే



ఎర్ర చెరువు వద్ద సర్వే చేస్తున్న అధికారులు

మహదేవపూర్, జూన్ 24: మండల కేంద్రంలోని ఎర్ర చెరువు వద్ద సోమవారం రెవెన్యూ, ఫారెస్టు, ఇరిగేషన్ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చెరువు కట్ట పెంచడంతో ఎఫ్‌టీఎల్ ఏరియాను నిర్ధారించేందుకు ఈ సర్వే నిర్వహించారు. అయితే రైతులెవరూ అందుబాటులో లేకపోవడంతో మరోసారి సర్వే నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ సర్వేలో నాయబ్ తహసీల్దార్ క్రిష్ణ, గిర్దావర్ జగన్మోహన్, ఎఫ్ఆర్వో కమల, సర్వేయర్ రమేష్ ఇరిగేషన్ డీఈఈ, ఏఈలు పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

వరంగల్ క్రైం, జూన్ 24: నిషేధిత గుట్కా ప్యాకెట్లను నిల్వపెట్టుకున్న కిరాణం షాపుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర కిరాణం షాపులో గుట్కా నిల్వలు ఉన్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. స్థానిక పోలీసులతో కలిసి సోమవారం దాడులు చేశారు. రూ. 9,780 విలువ కలిగిన సరుకును స్వాధీనం చేసుకుని విక్రయిస్తున్న యజమానిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ధ్రువీకరించారు.



దాడులు చేస్తున్న పోలీసులు

బిర్యానీ సెంటర్లనూ వదలని ఖాకీలు!

పెట్రోలింగ్ పోలీసుల చేతివాటం

రాత్రి వేళల్లో బిర్యానీ పొట్లాలు, చిల్లర వసూళ్లు

వరంగల్ క్రైం, జూన్ 24: కొంతమంది పోలీసుల వైఖరితో ఆ శాఖ పరువు పోతోంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొందరు పోలీసు అధికారులు అందినకాడికి దండుకోవడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ అడ్డంగా దొరికిపోతున్నారు. రోజువారి వసూళ్లకు తెగబడుతున్న పలువురు పోలీసులు.. చివరకు బిర్యానీ సెంటర్లను సైతం వదలడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ట్రైసిటీస్‌లో ఉన్న బిర్యానీ సెంటర్ల యజమానులు పోలీసులు వైఖరితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. రాత్రివేళల్లో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు.. బిర్యానీ సెంటర్లను వదలడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా కాజీపేట సెంటర్, హనుమకొండ, వరంగల్ బస్టాండ్ ఏరియాల్లో పోలీసుల చేతివాటం ఎక్కువగా ఉంటోందని సమాచారం. ప్రస్తుతం నగరంలో బిర్యానీ సెంటర్ల జోరు ఎక్కువగా ఉండటంతో పోలీసులు సైతం అదే స్థాయిలో వీరి వద్ద వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. రాత్రి వేళల్లో బిర్యానీ సెంటర్ల నుంచి ప్యాకింగ్‌లు తీసుకెళ్లడంతోపాటు వ్యాపారాన్ని బట్టి వసూళ్ల చేస్తున్నట్లు సమాచారం. ఆయా పోలీస్‌స్టేషన్‌ల అధికారులు సైతం లంచ్‌లు, డిన్నర్‌లకు బిర్యానీ సెంటర్లపై పడుతున్నట్లు తెలిసింది. స్టేషన్‌ల పరిధిలో ఉన్న పలు బిర్యానీ సెంటర్లకు ఈ నష్టం తప్పడం లేదనే ఆరోపణలున్నాయి. స్టేషన్ నుంచి వచ్చిన ఆర్డర్ అందించకుంటే ఆ బిర్యానీ సెంటర్‌కు రాత్రి వేళ పెట్రోలింగ్ సమయంలో ఇక్కట్లు తప్పవనే ప్రచారం ఉంది. డబ్బులు అడిగే పరిస్థితి ఉండదని సమాచారం. బిర్యానీ సెంటర్ల యజమానులు తెలిసిన వారివద్ద గోడువెల్లగక్కడం మినహా బయటికి చెప్పుకోలేని పరిస్థితి. నిఘా విభాగం అధికారులకు ఈ దందా గురించి తెలిసినా చూసీచూడనట్లు ఉంటున్నారనే విమర్శలున్నాయి.

విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూన్ 24: బ్రేక్ డౌన్, ట్రిప్పింగులు జరిగినప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ కార్యాలయంలో సోమవారం సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి నోడల్ ఆఫీసర్స్, సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్రేక్‌డౌన్, ట్రిప్పింగ్‌లు జరిగినప్పుడు ప్రతీచోట ప్రత్యామ్నాయ సరఫరా ఉండేవిధంగా చేయాలని సూచించారు. అలాగే పొడవాటి లైన్లు, ట్యాపింగ్ లైన్లు ఉన్న ప్రాంతాల్లో ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్(ఎఫ్‌పీఐ)లు అమర్చాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు వైఫల్యం చెందినప్పుడు వెంటనే వాటి స్థానంలో కొత్తవి మార్చాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, వి.మోహన్‌రావు, సీజీఎంలు కె.తిరుమల్‌రావు, టి.మధుసుదన్, రాజుచౌహాన్, కె.కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 24: రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ, డిప్లొమా ఇన్ ప్రీ ఎడ్యుకేషన్‌లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు అర్హత పరీక్షలో 50 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు 45 శాతం మార్కులు ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన పేర్కొన్నారు. సెప్టెంబరు 1, 2024 వరకు అభ్యర్థులు 17 యేళ్లు నిండాలని తెలిపారు. జూలై 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

బాలికను వేధించిన కేసులో ఒకరికి రెండేళ్ల జైలు

వరంగల్ లీగల్, జూన్ 24: మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని వేధించిన కేసులో నేరం రుజువైనందున పోక్సో చట్ట ప్రకారం రెండేళ్ల జైలు శిక్ష, రూ. వేయి జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి కం పోక్సో కోర్టు న్యాయమూర్తి బి.అపర్ణాదేవి సోమవారం తీర్పు చెప్పారు. అదేవిధంగా బాధితురాలికి రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని తీర్పులో ప్రభుత్వాన్ని ఆదేశించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన సింగారపు దిలీప్.. తనను వివాహం చేసుకోవాలని, లేదంటే చనిపోతానని అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను వేధించేవాడు. ఈ క్రమంలో 2018 ఏప్రిల్ 29న దిలీప్ హైదరాబాద్ నుంచి ఫోన్‌చేసి హైదరాబాద్‌కు వస్తే పెళ్లి చేసుకుందామని, రాకుంటే చనిపోతానని బెదిరించాడు. ఈ విషయంపై బాధితురాలు తల్లిదండ్రులకు తెలుపగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.వేయి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ అశోక్ సాక్షులను ప్రవేశపెట్టగా కె.పరమేశ్వరి లైజన్ అధికారిగా వ్యవహరించారు. కేసు దర్యాప్తు అధికారులుగా సీఐ ఎ.మహేందర్, ఎస్సై వి.విజయ్‌కుమార్ వ్యవహరించారు. భరోసా లీగల్‌సెల్ అధికారి సీహెచ్. నీరజ కేసుకు సహకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

మెడికల్ వార్డులో విద్యుత్ అంతరాయం

వరంగల్ మెడికల్, జూన్ 24: ఎంజీఎం ఆస్పత్రిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం తరుచూ జరుగుతూనే ఉంది. సోమవారం రాత్రి 6.30 గంటల నుంచి మెడికల్ వార్డుల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎంఎం ఈస్ట్, ఎంఎం వెస్ట్ రోగులంతా ర్యాంపు వద్దకు చేరుకున్నారు. సుమారు 60 మంది రోగులతోపాటు వారి అటెండెంట్లు చీకట్లోనే కాలం వెళ్లదీశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంజీఎం ఆస్పత్రిలో తరుచూ విద్యుత్ అంతరాయం ఏర్పడటం పట్ల రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

నవభారత.. సాక్షరత

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4.92 లక్షల మంది వయోజన నిరక్షరాస్యులు
- మొదటి విడతలో లక్ష మందిని అక్షరాస్యులను చేయాలన్నది లక్ష్యం
- ఇప్పటికే ప్రారంభమైన ప్రక్రియ
- సంపూర్ణ సాక్షరతకు ప్రత్యేక ఉల్లాస్ యాప్
- సాక్షర భారత్‌కు భిన్నంగా నవభారత్ సాక్షరత

హనుమకొండ, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యతలో భాగంగా వయోజనులందరినీ అక్షరాస్యులను చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు భారత విద్యామంత్రిత్వ శాఖ నవభారత్ సాక్షరత (న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్) కార్యక్రమాన్ని చేపట్టింది. చదువును మధ్యలో మానేసిన విద్యార్థులు, వయోజనులకు చదువు చెప్పాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గ్రామాలు, పట్టణాల్లో పదిహేనేళ్లు నిండిన నిరక్షరాస్య యువతీ, యువకులను అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దీని అమలులో ప్రభుత్వ ఉపాధ్యాయులే కీలకపాత్ర పోషించబోతుండడం గమనార్హం. రాష్ట్రంలోని ప్రతీ ఉన్నత పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయుడు సహా ముగ్గురు ఉపాధ్యాయులను నియమించాలని నిర్ణయించారు. వీరు ఆ గ్రామ పరిధిలోని నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి అక్షరాలు నేర్పించేలా కార్యాచరణ రూపొందిచారు.

వయోజన నిరక్షరాస్యులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4,92,449 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో నవభారత సాక్షరతా కార్యక్రమం కింద 1,03,646 మందిని అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యంగా నిర్ణయించారరు. హనుమకొండ జిల్లాలో 1,12,739 మంది వయోజనులైన నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 30,200 మంది కాగా, స్త్రీలు 82,539 మంది. అయితే నవభారత్ సాక్షరతా కార్యక్రమం కింద మొదటి విడతగా 19,250 మందిని అక్షరాస్యులను చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. వరంగల్ జిల్లాలో 86,228 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 30,838 మంది కాగా, స్త్రీలు 55,390 మంది. ఈ జిల్లాలో మొదటి విడతా 19,808 మంది అక్షరాస్యులను చేస్తారు. జనగామ జిల్లాలో 66,419 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 23,151 మంది కాగా, స్త్రీలు 43,268 మంది. వీరిలో నుంచి మొదటి విడత 16,075 మందిని అక్షరాస్యులను చేస్తారు. ములుగు జిల్లాలో 25,473 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 8,825 మంది కాగా, స్త్రీలు 16,648 మంది. వీరిలో మొదటి విడతా 5,046 మందిని అక్షరాస్యులను చేస్తారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 54,777 మంది నిరక్షరాస్యులు ఉండగా, వీరిలో పురుషులు 19,619 మంది, స్త్రీలు 35,158 మంది. వీరిలో మొదటి విడట 19,636 మందిని అక్షరాస్యులను చేస్తారు. మహబూబాబాద్ జిల్లాలో 1,46,813 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో పురుషులు 55,643 మంది కాగా, స్త్రీలు 91,170 మంది. వీరిలో మొదటి విడతగా 23,831 మందిని అక్షరాస్యులను చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.



ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురు

నవభారత్ సాక్షరత కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రతీ పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోనున్నది. ప్రధానోపాధ్యాయుడిని అక్షరాస్యత పర్యవేక్షకుడి (లిటరసీ సూపర్వైజర్)గా ఓ ఉపాధ్యాయుడిని శిక్షకుడిగా, మరొకరు సర్వేయర్‌గా ఎంపిక చేయనున్నారు. వీరితోపాటు ఆయా గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళలు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను భాగస్వాములను చేయనున్నారు. వీరంతా కలిసి వయోజనులను గుర్తించి అక్షరాలు నేర్పిస్తారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 5లక్షల మంది పదిహేనేళ్లు పైబడిన వయోజన నిరక్షరాస్యులున్నారు. వీరిలో లక్ష మందిని మొదటి దశలో అక్షరాస్యులుగా చేస్తారు.

కోడ్ ముగిసింది.. ఇక జోరుగా..

ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ కూడా పూర్తికావడంతో ఈ కార్యక్రమాన్ని వేగంగా అమలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవి సెలవుల్లోనే ప్రారంభించి, కార్యకర్తల ఎంపిక, శిక్షణ పూర్తి చేయాలని నిర్ణయించారు. కోడ్ ముగియడంతో కార్యాచరణ మొదలు పెట్టారు. ముందుగా ప్రతీ పాఠశాల నుంచి ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ఈ తర్వాత అధిక జనాభా ఉన్న గ్రామాల్లో నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి శిక్షణ ఇస్తారు. శతశాతం అక్షరాస్యతకు ఈ ప్రక్రియ దోహదపడుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఉల్లాస్ యాప్

కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసేందుకు ప్రత్యేకంగా ఉల్లాస్ (అండ్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పాఠశాల కోడ్ సహాయంతో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఉనికి, గుర్తింపు తదితర వివరాలు ఇందులో పొందుపరిచారు. తొలి విడతలో కొంత మందిని ఎంపిక చేసి అక్షరాలు నేర్పించేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. కుటుంబసభ్యుల వివరాలు, నివాస ప్రాంతం తదితర అంశాలను పొందుపరుస్తారు. ఈ యాప్ ద్వారా ప్రాథమిక విద్య, డిజిటల్, ఆర్థిక, అక్షరాస్యత, వృత్తినైపుణ్యాలు, క్లిష్టమైన జీవన నైపుణ్యాలను అందిస్తారు. విభిన్న అభ్యాస వనరుల్లో నిమగ్నమవడానికి డిజిటల్ గేట్‌వేగా ఉపయోగపడుతుంది. ఆవాస పద్ధతిలో అధిక జనాభా ఉన్న గ్రామాలను గుర్తిస్తారు. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తిస్తారు. మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో నిరక్షరాస్యులైన వయోజనులు ఎక్కువగా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

కలెక్టర్లు చైర్మన్లుగా..

నవభారత సాక్షరతా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటికే ఆరు జిల్లాల కలెక్టర్లు విద్యాశాఖ అధికారులతో సమావేశాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నవభారత్ సాక్షరతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నవభారత్ సాక్షరతా కార్యక్రమంలో కలెక్టర్ చైర్మన్‌గా, ఈడీవో మెంబర్ కన్వీనర్‌గా, వయోజన విద్య ఉపసంచాలకుడు లైజన్ అధికారిగా వ్యవహరిస్తారు. నవభారత సాక్షరతా పథకం అమలులో భాగంగా వివిధ రాష్ట్రాలు తమ సౌకర్యాన్ని బట్టి పేర్లను మార్చుకున్నాయి. మన రాష్ట్రంలో దీనిని ఉల్లాస్ నవభారత్ సాక్షరతగా అమలు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 8,30,332 మంది వియోజనులను అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 50వేల మందిని చేయాలని నిర్ణయించారు. నవభారత సాక్షరత కార్యక్రమం అమలుకు కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40శాతం నిధులను వెచ్చిస్తుంది. జాతీయ నూతన విద్యావిధానం ప్రకారం వచ్చే ఐదేళ్లలో నవభారత సాక్షరత కార్యక్రమం ద్వారా దేశం సంపూర్ణ అక్షరాస్యత సాధించాలన్నది లక్ష్యం. వయోజన విద్యలో భాగంగా 2018 వరకు నిర్వహించిన సాక్షర భారత్ కార్యక్రమానికి భిన్నంగా వ్యక్తి సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా కొత్త కార్యక్రమాన్ని రూపొందించారు. లక్ష్యాన్ని అయిదు దశల్లో పూర్తి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. 100 రోజుల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు బోధనాభ్యసన సామాగ్రి సిద్ధం చేస్తున్నారు.

ఇలా నేర్పిస్తారు..

వయోజనులకు ఇట్టే అర్థమయ్యేలా సులభంగా చదువు చెప్పనున్నారు. ప్రత్యక్ష తరగతులు, రేడియో, టీవీ సహా సెల్‌ఫోన్‌ద్వారా పాఠాలు నేర్పుతారు. ఇందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ప్రధానంగా గణితంలో చతుర్విధ ప్రక్రియలు సహా జీవన సాఫల్యత గురించి మనోవిజ్ఞానపాఠాలు చెబుతారు. అలాగే నేర్చుకున్న విషయాలపై పరీక్షలు నిర్వహించి అందుకు అనుగుణంగా చర్యలు చేపడతారు. ఎంపిక చేసిన నిరక్షరాస్యులను మొదటి 100 రోజుల్లో రాయడం, చదవడం చిన్న చిన్న లెక్కలు చేయడం నేర్పిస్తారు. 150మార్కులతో తుదిపరీక్ష నిర్వహించి ఉత్తీర్ణ సాధించినవారికి ధ్రువపత్రాలు ఇస్తారు. రెండో దశలో క్రిటికల్ లైఫ్ స్కిల్స్‌లో భాగంగా ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ పరిజ్ఞానం, చట్టాలపై అవగాహన పెంచేలా శిక్షణ ఇస్తారు. ఆరోగ్య పరిరక్షణ, పిల్లల పోషణ, విద్య, కుటుంబ సంక్షేమంపై అవగాహన కల్పిస్తారు. మూడోదశలో 3-5 తరగతులు ప్రాథమిక విద్యగా, 6-8 తరగతులు మాధ్యమిక విద్యగా, 9-12 తరగతులను సెకండరీ విద్యగా అందించేందుకు చర్యలు తీసుకుంటారు. నాలుగో దశలో వృత్తి నైపుణ్యాలు పెంపొందించే శిక్షణ ఇచ్చి, స్థానికంగా ఉపాధి అవకాశం కల్పిస్తారు. అయిదు దశలో శిక్షణ పొందిన వారితో స్వయం సహాయక సంఘాలు, వివిధ సంస్థలు ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చెందేలా ప్రోత్సాహం అందిస్తారు.

లక్షమంది అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యం



టి. రమేష్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్, వయోజన విద్య

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4.92 లక్షల మంది నిరక్షరాస్యులున్నారు. మొదటి విడతగా లక్షమందిని అక్షరాస్యులను చేయాలన్నది లక్ష్యం. నవభారత్ సాక్షరతా కార్యక్రమం వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్నది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. గతంలో సాక్షరతా మిషన్‌కు భిన్నంగా ఈ కార్యక్రమం పూర్తిగా ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో పూర్తిగా స్వచ్ఛంద కార్యకర్తల సహకారంతో అమలవుతుంది. పాఠశాల, కళాశాల విద్యార్థులను సైతం ఇందులో భాగస్వాములను చేస్తాం. ఇందుకు సంబంధించిన స్టడీ మెటీరియల్ కూడా సిద్ధమైంది. నవభారత్ సాక్షరతా కార్యక్రమంలో విద్యావంతులైనవారు, విద్యార్థులు అక్షరాస్యులైన ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయడం ద్వారా మన దేశాన్ని సంపూర్ణ అక్షరరాస్యతగా మార్చాలి.

ప్రమాదపుటంచున లక్నవరం చెరువు

- తూములో కూలిన రాళ్లు
- మరమ్మతులు చేయిస్తున్న నీటిపారుదల శాఖ



నీళ్లు లేక వెలవెలబోతున్న లక్నవరం సరస్సు

గోవిందరావుపేట, జూన్ 24: ఉయ్యాల వంతెనలు, మధ్యలో దీవులు, చుట్టూ పచ్చని కొండలతో ప్రకృతి రమణీయతకు నిలువుటద్దంగా ఉండే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం లక్నవరం సరస్సు ప్రమాదంలో పడింది. తూము లోపలి భాగంలో రాళ్లు కూలిపడగా.. ఇటీవల ఆ విషయాన్ని గుర్తించిన నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. కాకతీయుల కాలంలో నిర్మితమైన ఈ లక్నవరం సరస్సు 8,794ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తోంది. సుమారు 300ఏళ్లక్రితం నిర్మించినట్టుగా భావిస్తున్న తూములలో గత కొన్నేళ్లుగా లీకేజీలు ఏర్పడ్డాయి. మూడు షెట్టర్లు కలిగిన తూములో ఓ షట్టర్ లోపల రాళ్లు కూలినట్లు నీటిపారుదల శాఖ అధికారులు గుర్తించి తక్షణమే మరమ్మతు చేయకుంటే సరస్సులోకి పూర్తిస్థాయి నీటిమట్టం చేరి ఒత్తిడి పెరిగితే రాతికట్టడమైన తూము కూలిపోయే ప్రమాదముందని భావించారు. తక్షణ మరమ్మతు కోసం ప్రభుత్వానికి నివేదించగా రూ.22లక్షల నిధులు విడుదలవగా వెంటనే పనులు ప్రారంభించారు. పూర్తిగా రాతితో నిర్మించిన తూమును సనాతన పద్ధతిలోనే మరమ్మతు చేయాలని నిర్ణయించారు. కాకతీయుల కాలం నుంచి నైజాం పాలకుల వరకు అనేక కట్టడాలలో అవలంబించిన విధానాన్ని కొనసాగిస్తూ కూలిన రాళ్ల స్థానంలో అంతే వ్యాసార్థం కలిగిన రాళ్లను పేర్చి డంగు సున్నంతో ప్లాస్టరింగ్ చేస్తున్నారు. క్యూరింగ్ కోసం కరక్కాయ, బెల్లం కలిపిన ద్రావకాన్ని ఉపయోగిస్తున్నారు. ఈ తరహా నిర్మాణంలో అనుభవం ఉన్న తమిళనాడుకు చెందిన నిర్మాణ కార్మికులతో పనులు చేయిస్తున్నారు. వారం క్రితం ప్రారంభమైన పనులను జూన్ 30లోపు పూర్తి చేయనున్నారు. వర్షాలు కురిసి అకస్మాత్తుగా వరద ముంచెత్తితో పనులకు అటంకం కలిగే అవకాశముండగా తూముకు పై భాగంలో రింగ్ బండ్‌ను నిర్మించారు. కాగా, మరమ్మతు పనులకోసం సరస్సులోని నీటిని ఖాళీ చేయడంతో 1,945ఎంసీఎఫ్‌టీ సామర్థ్యం కలిగిన సరస్సు డెడ్ స్టోరేజీ స్థాయిలో వెలవెలబోతూ దర్శనమిస్తోంది. వారాంతపు సెలవులు, విడిది కోసం లక్నవరం వస్తున్న పర్యాటకులు కుంటలను తలపిస్తున్న సరస్సును చూసి నిరుత్సాహానికి గురవుతున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాస్ స్పందించారు. 'తూము లోపల ఏర్పడిన గండిని గుర్తించి మరమ్మతు చేస్తున్నాం.. లేకుంటే భవిష్యత్‌లో పెను విపత్తు జరిగి ఉండేది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేస్తున్నాం. ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి పరిస్థితిని నివేదిస్తున్నాం. 25న రాష్ట్రస్థాయి పరిశీలన బృందం లక్నవరం పరిశీలనకు రానుంది. రాష్ట్రంలో తొలిసారి ప్రయోగాత్మకంగా డంగు సున్నం, కరక్కాయ, బెల్లం మిశ్రమాలతో తూముల మరమ్మతులు జరుగుతున్నాయి.. సఫలమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పురాతన రిజర్వాయర్లకు కూడా ఇదే పద్ధతిలో మరమ్మతు పనులు చేసే అవకాశముంది' అని పేర్కొన్నారు.



లక్నవరం చెరువు తూముకు మరమ్మతు చేస్తున్న తమిళనాడు కార్మికులు

వయోవృద్ధులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలి



ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, జూన్ 24: ఎంజీఎం ఆస్పత్రిలో వయోవృద్ధులకు ప్రత్యేకవార్డు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దామెర నర్సయ్య కోరారు. సోమవారం ఎంజీఎంలోని వయోవృద్ధుల విభాగాన్ని సందర్శించారు. అనంతరం వారికి అందిస్తున్న సేవలపై ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్‌కు వివరించారు. వయోవృద్ధుల సౌకర్యం కోసం ప్రత్యేక వార్డు ఏర్పాటు చేస్తే సౌలభ్యంగా ఉంటుందని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగులగాం నరసయ్య, కార్యదర్శి తేరాల యుగంధర్, కార్యవర్గ సభ్యులు గంగారపు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 24: జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ములుగు రోడ్‌లోని ఉపాధి కల్పన, శిక్షణ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఉపాధి కల్పన నోడల్ అధికారి ఎం.మల్లయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు కంపెనీలకు చెందిన సుమారు 100 ఉద్యోగాల కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో 50, జేఎస్పార్ సన్‌సిటీ గ్రూప్‌లో 50 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాసైన అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని ఆయన పేర్కొన్నారు. స్విగ్గీలో రూ.14 వేలతో పాటు రూ.3 వేల ఇన్సెంటివ్ ఉంటుందని, జేఎస్పార్‌లో ఒక్క ప్లాట్ బుక్ చేస్తే రూ.50వేలు కమీషన్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన 18 నుంచి 45 యేళ్ల మధ్య గల వయస్సు గల వారు 26న ఉదయం 11 గంటలకు ములుగురోడ్‌లోని ఉపాధి కల్పన, శిక్షణ కార్యాలయంలో పాల్గొనాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9848895937 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

'ఇంటర్ సప్లిమెంటరీ'లో శివాని జయకేతనం



ఎ.హాసిని | బి. మమత | కె. కౌషిక్ | ఎం. సుష్మిత | జి. హన్సిక

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 24: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో శివాని విద్యార్థులు జయకేతనం ఎగురవేసినట్లు కరస్పాండెంట్ టి.స్వామి చెప్పారు. ఎంపీసీ ఫస్టియర్‌లో చీర్ల సాయిజ 468 మార్కులు, కె.మాధవి 468, ఎం.యశ్వంత్, వి.అజయ్, పి.జెమిని, కె.ఆకాంక్ష, జి.తరుణ్, బి.మనీష, ఆర్.రాజ, సల్మా, ఎ.హర్షిత్ సాయిలకు 467 మార్కులు సాధించారు. బైపీసీ ఫస్టియర్‌లో ఎం.సుష్మిత జి.హన్సిక, ఎ.హాసిని, బి.మమత, కె.కౌషిక్ 437 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా స్వామి ప్రిన్సిపాళ్లు జి.సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్, డైరెక్టర్లు టి.రాజు, ఎస్.రమేష్, ఎ.మురళీధర్, వి.సురేష్, ఎస్. సంతోష్‌రెడ్డితో కలిసి విద్యార్థులను అభినందించారు.

విద్యుత్ ప్రజావాణికి 21 దరఖాస్తులు

హనుమకొండ టౌన్, జూన్ 24: వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంలో భాగంగా సోమవారం నిర్వహించిన విద్యుత్ ప్రజావాణికి హనుమకొండ, వరంగల్ సర్కిల్‌లో 21 దరఖాస్తులు వచ్చాయి. కాగా హనుమకొండ సర్కిల్‌లోని హనుమకొండ రూరల్ డివిజన్‌లో 10, టౌన్ డివిజన్‌లో మూడు, మధ్యాహ్నం నిర్వహించిన సర్కిల్ కార్యాలయంలో ఒక దరఖాస్తు వచ్చినట్లు హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ పేర్కొన్నారు. వరంగల్ సర్కిల్‌లో 8 దరఖాస్తులు రాగా, బిల్డింగ్ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలపై ఫిర్యాదు చేశారన్నారు.

మానుకోటలో చోరీ సొత్తు రికవరీ

24 గంటల్లో దొంగను పట్టుకున్న పోలీసులు

1.906 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం

వివరాలు వెల్లడించిన టౌన్ సీఐ దేవేందర్

మహబూబాబాద్ రూరల్, జూన్ 24 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న అయ్యప్ప జువెలరీషాపులో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఈ విషయమై షాపు యాజమాని రున్వాల్ భన్సీలాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. ఆదివారం క్లూస్‌టీం, పోలీసులు చోరీ జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బుక్కబజారులో నివాసముంటున్న చత్రి విజయ్‌కుమార్ జిల్లా కేంద్రంలో గుర్ఖాగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న అయ్యప్ప జువెలరీషాపు వెనుకభాగం నుంచి పైకప్పులోని పెంకులను తీసి షాపులోకి ప్రవేశించినట్లు చెప్పారు. షాపులో ఉన్న పెద్ద, చిన్న వెండి గిన్నెలు 33, వెండి దీపపు కుందులు 10, వెండి గ్లాసులు 15, చిన్న చెంచాలు 3, వెండి ప్లేట్‌లు 3, కుంకుమ వేసుకునే నాలుగు గిన్నెల సెట్‌లు 2 వెరసి మొత్తం 1.906 కేజీల వెండి అభరణాలను చోరీ చేసినట్లు చెప్పారు. వాటిని ప్లాస్టిక్ సంచిలో తీసుకుని వరంగల్‌లో విక్రయించేందుకు వెళ్తుండగా ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసుల సహకారంతో ఉదయం పాత నేరస్తుడైన చత్రి విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు డోర్నకల్ ప్రాంతాల్లో పలు దొంగతనాలు చేసి జైలుకు వెళ్లాడని, నేరం రుజువు కావడంతో శిక్ష అనుభవించి ఇటీవలే బయటకు వచ్చినట్లు చెప్పారు. ఆ తర్వాత జూవెలరీషాపులో చోరీ చేసినట్లు చెప్పారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై బి.వి జయ్‌కుమార్, సీఆర్పీ, జీఆర్పీ పోలీసులను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అభినందించారు.



మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో చోరీ వివరాలు వెల్లడిస్తున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్



7వ బ్లాక్‌లో షీట్‌పైల్ అమరిక పనులు

మేడిగడ్డ బ్యారేజీ వద్ద కొనసాగుతున్న మరమ్మతులు

పూర్తయిన సీసీ బ్లాకుల పునరుద్ధరణ

వర్షంతో అన్నారం సరస్వతి బ్యారేజ్ మరమ్మతు పనులకు ఆటంకం

మహదేవపూర్ రూరల్ / మహదేవపూర్, జూన్ 24 : కుంగిన మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాకులో చేపట్టిన తాత్కాలిక మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. సీసీ బ్లాకుల పునరుద్ధరణ పనులు పూర్తి కాగా షీట్‌పైల్ అమరిక పనులు పూర్తి కావచ్చాయి. బ్యారేజీకి దిగువన సీసీబ్లాకులతో పాటు దాని కింద ఉన్న కంకర రాళ్లపై ఐరన్ నెట్ వేసే పనులు కొనసాగుతున్నాయి. మట్టినమూనాల సేకరణతో పాటు గ్రౌటింగ్ పనులు కొసాగుతున్నాయి.

సరస్వతి బ్యారేజ్ పనులకు ఆటంకం

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన సరస్వతీ బ్యారేజీకి బుంగలు ఏర్పడిన నేపథ్యంలో మరమ్మతు పనులు జరుగుతుండగా సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ఆ పనులకు ఆటంకం కలిగింది. పుణేకు చెందిన కేంద్ర జల, శక్తి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తల బృందం నాలుగు రోజులుగా చేస్తున్న పరిశోధనలను నిలిపేసి సుందిళ్ల వద్ద నిర్మించిన పార్వతీ బ్యారేజీకి వెళ్లారు. వాస్తవానికి ఆ బృందం మరోవారం రోజుల పాటు సరస్వతీ బ్యారేజీ వద్దే ఉండాల్సి ఉండగా పనులకు ఆటంకం కలగడంతో వారు సుందిళ్లకు వెళ్లాల్సి వచ్చింది. లీకేజీలు, సీపేజీలు లేకుండా చేయడానికి కెమికల్ గ్రౌటింగ్ తోపాటు జియోఫిజికల్ పరీక్షలకు ఆటంకం కలిగింది. కేవలం డ్రిల్లింగ్ పనులు మాత్రమే జరుగుతున్నాయి.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే దంపతులు


మాజీ సీఎం కేసీఆర్‌తో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 24: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేసీఆర్‌ను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి-జ్యోతి దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం ఎర్రవెల్లి ఫామ్ హౌజ్‌లో ఆయన్ను కలిసి రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపాలవడంతో భూపాలపల్లి ప్రాంతానికి సంబంధించి పార్టీ పరిస్థితిపై కేసీఆర్‌తో గండ్ర దంపతులు చర్చినట్లు తెలిసింది.

రైతులకు అందుబాటులో ఎరువులు


ఎరువుల బస్తాలను పరిశీలిస్తున్న సీఈవో

కాటారం, జూన్ 24: ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం(పీఏసీఎస్)ద్వారా రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని సంఘం అధికారులు సోమవారం తెలిపారు. గోదాంలో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల బస్తాలున్నాయని పీఏసీఎస్ సీఈవో ఎడ్ల సతీష్ తెలిపారు. ఎరువులు కావాల్సిన రైతులు వ్యవసాయాధికారులను పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డులతో సంప్రదించాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఈవో సూచించారు.


ఎంసీ మీటింగ్‌కు తప్పక హాజరు కావాలి

మల్హర్, జూన్ 24: మంగళవారం నిర్వహించే ఎంసీ(మేనిజింగ్ కమిటీ) మీటింగ్‌కు సభ్యులు తప్పక హాజరు కావాలని కోరుతూ జిల్లా కో ఆపరేటివ్ అధికారి ఇప్పటికే సభ్యులకు నోటీసులు పంపించారు. తాడిచర్ల పీఏసీఎస్ చైర్మన్ రామారావుపై అనర్హత వేటు వేయడం, వైస్ చైర్మన్ సూర్య ప్రకాశ్‌రావు రాజీనామా చేయడంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మనుగడ సందిగ్ధంలో పడింది. తాడిచర్ల పీఏసీఎస్‌లో సభ్యుల సంఖ్య కూడా 13 నుంచి 9కి తగ్గింది. ఈ సమావేశంలో మిగిలి ఉన్న సభ్యుల నుంచి ఒకరిని తాత్కాలికంగా చైర్మన్‌గా ఎన్నుకుంటారనే ప్రచారం సాగుతోంది. ప్రస్తుత పాలక వర్గం కాలపరిమితి వచ్చే ఏడాది ఫిబ్రవరితో ముగియనుంది. జిల్లా కోఆపరేటివ్, స్థానిక పీఏసీఎస్ అధికారులపై ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

కాటారం, జూన్ 24:అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారెవరైనా కఠిన చర్యలు తప్పవని కాటారం డీఎస్పీ గడ్డం రాంమోహన్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని కాటారం జీపీ పరిధిలో పోలీసులు రాత్రి కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత సక్రమమార్గంలో పయనించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. మద్యం, గంజాయికి అలవాటుపడి అల్లర్లు, గొడవలకు దిగితే వారిపై కేసులు జీవితాంతం ఉంటాయని హెచ్చరించారు. మహిళలు, బాలికలు, యువతులను వేధిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం ఎస్సై-2 హరిశేఖర్ సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

కాళేశ్వరం ఇన్‌చార్జ్ ఎస్సైగా చక్రపాణి



మహదేవపూర్, జూన్ 24: మండలంలోని కాళేశ్వరం ఇంచార్జి ఎస్సైగా మహదేవపూర్ 2 ఎస్సై చక్రపాణి నియమితులయ్యారు. సోమవారం ఉత్తర్వులు రావడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కాళేశ్వరం ఎస్సైగా ఉన్న భవానీ సేన్ మహిళా కానిస్టేబుల్‌పై లైంగిక ఆరోపణ నేపథ్యంలో అరెస్టు చేసి సర్వీస్ నుంచి రిమూవల్ చేయడంతో కాళేశ్వరం ఎస్సై పోస్టు ఖాళీగా ఉంది. రెండు రాష్ట్రాల సరిహద్దు కలిగి ఉండడం, పుణ్యక్షేత్రం ఉండడంతో కాళేశ్వరం ఎస్సై పోస్టు కీలకంగా మారింది. దీంతో మహదేవపూర్ ఎస్సై 2 చక్రపాణిని కాళేశ్వరం స్టేషన్‌కు ఇంచార్జిగా నియమించారు.

విద్యుత్ ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

వాజేడు, జూన్ 24: మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విద్యుత్ ప్రజావాణిలో దరఖాస్తులను సబ్ ఇంజనీర్ నాగేష్ స్వీకరించారు. మండలకేంద్రంలోని జంగాలపల్లికి చెందిన రైతుకు సంబంధించిన పొలంలో మిడిల్ పోల్ వేయాలని దరఖాస్తు సమర్పించగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని ఏఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐ మదన్‌హాసన్, జేఎల్ఎం వంశీ, తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 24: హాకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల వాల్ పోస్టర్‌ను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 28న జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని జిల్లా క్రీడల శాఖ అధికారిని ఆదేశించారు.

ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కల్పించాలి

ములుగు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య


వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న అప్పయ్య

ములుగు రూరల్ జూన్ 24 : ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కల్పించి, మెరుగైన సేవలు అందించాలని ములుగు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో)అల్లం అప్పయ్య వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేసి వైద్యులకు సూచనలు చేశారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై పారామెడికల్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో ప్రబలే విష జ్వరాల విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద ప్రాంతాల్లో ఉన్న గర్భిణులను గుర్తించి వారిని ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అనంతరం మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ పోరిక రవిందర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతీ శుక్రవారం డ్రైడేను పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రతీ ఇంట్లో ఫీవర్ సర్వే చేసి జ్వర పీడితులను గుర్తించాలన్నారు. ఈకార్యక్రమంలో మతాశిశు సంరక్షణ ప్రోగ్రాం ఆఫీసర్ చీర్ల శ్రీకాంత్, రణధీర్, వైద్యులు మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, డెమో తిరుపతయ్య, ఎఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


ములుగులో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

ములుగు కలెక్టరేట్, జూన్ 24: బీజేవైఎం నాయకులపై పోలీసులతో విచక్షణారహితంగా దాడులు చేయడాన్ని ఖండిస్తూ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగ రాజు ఆధ్వర్యంలో సోమవారం నాయకులు ములుగులోని 163వ జాతీయ రహదారిపై నిరసన తెలిపి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మాట్లాడుతూ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్, మెగా డీఎస్సీ చేపడతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ఉద్యోగ నోటిఫికేషన్ లేకుండా నిరాశకు గురిచేస్తుందని, దాడులు చేస్తూ భయభ్రాంతులకు పాల్పడుతుందని అన్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో అదనంగా పోస్టులు పెంచాలని, 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని, గ్రూప్-2,3 నోటిఫికేషన్ పోస్టులను పెంచి నోటిఫికేషన్ విడుదల చేయాలని, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్టీమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, నాయకులు రవింద్రచారి, కృష్ణాకర్, గాధం కుమార్, కత్తి హరీష్, మాదరి శ్రీకాంత్, పులి ప్రవీణ్, భాను, సిద్దు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా బుక్స్ అమ్ముతున్నారని ఏబీవీపీ ఆందోళన

భూపాలపల్లిటౌన్, జూన్ 24: ఓ ప్రైవేటు పాఠశాలలో అక్రమంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారని ఏబీవీపీ నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. గాంధీనగర్‌లో గల ఓ ప్రైవేటు పాఠశాలలో సదరు యాజమాన్యం అదే పాఠశాలలో పుస్తకాల విక్రయకేంద్రాన్ని ఏర్పాటు చేసి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా పుస్తకాలు విక్రయించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయమై ఎంఈవోకు ఫిర్యాదు చేయగా స్థానిక సీఆర్‌పీని పంపించి పుస్తకాల కౌంటర్‌ను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శివాజీ, నాయకులు రాజు, కుమార్, తరుణ్, వికాస్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 30వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వాజేడు, జూన్ 24: వాజేడు, వెంకటాపురం(నూగూరు) మండలాల్లో ఈనెల 25నుంచి 30వతేదీ వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్ శాఖ ములుగు డీఈ పులుసం నాగేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగపేట మండలం కమలాపూర్ 132కేవీ నుంచి వెంకటాపురం(నూగూరు) 132 కేవీకి వచ్చే విద్యుత్‌లైన్‌లో మరమ్మతు పనులు జరుగనున్నాయని, ప్రతిరోజు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈవిషయాన్ని వాజేడు, వెంకటాపురం మండలాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

భారీగా గుట్కాల పట్టివేత


వాజేడులో పట్టుబడిన గుట్కాతో పోలీసులు

ములుగు, జూన్ 24: జిల్లా కేంద్రంలోని సాంబశివ కిరాణా షాపులో సోమవారం రాత్రి స్థానిక పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా నిల్వ చేసిన నిషేధిత గుట్కా, అంబర్, జర్దా ప్యాకెట్లను గుర్తించారు. రూ. రూ 1.78 వేల విలువైన సరుకును సీజ్ చేసి షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చవళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు.

వాజేడు: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ నిషేధిత గుట్కాలను భారీగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా కిరాణా షాపులలో గుట్కాను విక్రయిస్తున్న వ్యక్తుల వద్ద సైతం గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. వాజేడు ఎస్సై రుద్రారపు హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం మండలంలోని గుమ్మడిదొడ్డి వద్ద వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్న క్రమంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం తార్లగూడ నుంచి వెంకటాపురం వైపు వెళ్తున్న ఆటో, బైక్ మీద వస్తున్న వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వారిని పట్టుకుని ఆటోను, బైక్ మీద ఉన్న వ్యక్తులను తనిఖీ చేయగా సుమారు పది బస్తాలలో గుట్కాను గుర్తించి స్టేషన్‌కు తరలించారు. వెంకటాపురం(నూగూరు)కు చెందిన తాండ్రపల్లి సతీష్, ఎర్రావుల మహేష్, పానెం ముకేష్‌లతో పాటు మరొక మైనర్ బాలుడు కూడా పట్టుబడగా వారిపై కేసులు నమోదు చేశారు. అదే విధంగా లోకల్ పెట్రోలింగ్‌లో భాగంగా మండపాక వద్ద తనిఖీలు చేస్తున్న క్రమంలో షాపులలో గుట్కాను విక్రయిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి గుట్కాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. దుకాణ యజమానులు పగిడాల సాయిబాబు, చిడెంపల్లి నరసింహులు, వంగరి సమ్మయ్య, బత్తిన రవి, కావిరి రాంబాబులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. పట్టుబడిన గుట్కా విలువ సుమారు రూ 53,450 ఉంటుందని, ఆటో, బైక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

పేరూరులో..

పేరూరు స్టేషన్ పరిధిలో సైతం ఇద్దరి వ్యక్తుల వద్ద గుట్కాను స్వాధీనం చేసుకున్నట్లు పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపారు. ధర్మవరంనకు చెందిన తునికి సందీప్, పేరూరుకు చెందిన ఎర్రావుల వేణుల వద్ద లోకల్ పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో కిరాణా షాపులలో గుట్కాను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన గుట్కా విలువ రూ 3,670 ఉంటుందని వీరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వారంతపు సంత వేలం పాటలు

భూపాలపల్లిటౌన్, జూన్ 24: ఈ నెల 28న ఉదయం 11గంటలకు వారంతపు సంత, లైబజార్ ల కోసం వేలం పాటలు వేయనున్నట్లు భూపాలపల్లి మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. గంప చిట్టి రూ.2,48,319, భూపాలపల్లి వారంతపు సంతతో పాటు జంగేడు, కాశీంపల్లి సంతలకు సైతం రూ.3,05,253, డిమాండ్ డ్రాఫ్టును పెట్టినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు పాటలో పాల్గొనాలని కోరారు. డీడీతో పాటు రూ.2500 రశీదు పొందాలని సూచించారు.

గర్మిళ్లపల్లిలో వారసంత ప్రారంభం

టేకుమట్ల, జూన్ 23: మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామంలో నేడు (సోమవారం) వారసంతం ప్రారంభించనున్నట్లు ఆ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దాసారపు సదానందం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇకపై ప్రతి సోమవారం గర్మిళ్లపల్లి కూడలిలో వారసంత నిర్వహించడం జరుగుతందని, గ్రామస్థులు, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేటి వారసంత ప్రారంభోత్సవానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హజరై ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలని నిరసన


జిల్లా గ్రంథాలయం ఎదుట నిరసన తెలుపుతున్న డీఎస్సీ అభ్యర్థులు

ములుగు కలెక్టరేట్, జూన్ 24: ప్రమోషన్ ద్వారా ఏర్పడ్డ ఖాళీలను కలిపి 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు సోమవారం ములుగులోని జిల్లా గ్రంథాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన 5,089పోస్టులను రద్దుచేయాలని, గత ఫిబ్రవరిలో కాంగ్రెస్ ప్రభుత్వం 11.062 పోస్టులకు విడుదల చేసిన నోటిఫికేషన్‌తోపాటు ప్రమోషన్ ద్వారా ఏర్పడ్డ ఖాళీలను కలుపుకొని మెగా డీఎస్సీ నిర్వహించాలన్నారు. అప్లికేషన్ చివరితేదీ నుంచి డీఎస్సీ పరీక్షలకు కనీసం 45రోజుల సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ ఇర్ఫాన్, ఉపాధ్యక్షుడు కస్తూరి కృష్ణవంశీ, సభ్యులు కడారి రమేష్, బలుగూరి అశోక్, తండ రమ్య, ఎమ్డీ.ఆయేషా, అప్సాన, అఖిల్, ప్రశాంత్, శ్రీను, శశి, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు


తాడ్వాయిలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్న ఎంఈవో

తాడ్వాయి, జూన్ 24: మండలకేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఎంఈవో యాప సాంబయ్య ఆధ్వర్యంలో స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు మండలస్థాయి ఎంపిక క్రీడా పోటీలు జరిగాయి. 4,5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. ఇందులో 12మంది విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు ఎంఈవో సాంబయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ రేగ కేశవరావు, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సమ్మయ్య, సతీష్, సునీత, స్వామి, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మల్హర్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించే హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్లో 4వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని వేల్పుల ప్రభాకర్, పీడీ సరస్వతిలు సోమవారం తెలిపారు. నేడు మండల కేంద్రమైన తాడిచర్ల ఉన్నత పాఠశాల ఆవరణంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికకు వచ్చే విద్యార్థులు వయస్సు 8 నుంచి 9 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు పీడీ సరస్వతి 90009 48940 లో సంప్రదించాలన్నారు.

● గోవిందరావుపేట: స్పోర్ట్స్ స్కూల్‌లో నాల్గోతరగతిలో ప్రవేశం కోసం ఈనెల 25న మండలకేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో గొంది దివాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పుట్టినతేదీ, స్టడీ, సంబంధిత సర్టిఫికెట్లతో ఎంపిక పోటీలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

సర్వే చేసిన భూములకు పట్టాలివ్వాలి

కాటారం, జూన్ 24:మండలంలోని కాటారం, కొత్తపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలోని 501, 418, 94 సర్వే నెంబర్లలో సర్వే చేసిన భూములకు పట్టాలివ్వాలని కలెక్టర్ రాహుల్‌శర్మను ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కొత్తపల్లి మాజీ సర్పంచ్ రఘురాంనాయక్, కాటారం మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్ కోరారు. సోమవారం ప్రజావాణిలోవారు కాటారం, సుందర్రాజ్‌పేట గ్రామాలకు చెందిన పలువురు రైతులతో కలిసి కలెక్టర్‌ను కలిసి పట్టాలిప్పించాలని విన్నవించారు. దీనిపై కలెక్టర్ రాహుల్‌శర్మ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీపీ సమ్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో రామిళ్ల రాకేష్, దేవదాస్, రఘువీర్, తిరుమల్, రాజబాబు, రాంనారాయణ, సుశీల తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూమిని గిరిజనులకు కేటాయించాలి

వెంకటాపురం(నూగూరు), జూన్ 24: మండలంలోని బోదాపురంలో ఉన్న ప్రభుత్వ భూమిని గుడిసెలు వేసుకున్న గిరిజనులకు కేటాయించాలని సీపీఎంపార్టీ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం తహసీల్దార్ వీరభద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గ్యానం వాసు మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేద గిరిజనులకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని పలుమార్లు అధికారులను కోరుతున్నా స్పందించడంలేదన్నారు. దీంతో గిరిజనులు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకోవాల్సి వచ్చిందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజనులకు భూమిని కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమ్మరి శ్రీను, పండా శ్రీను, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్బీఐ మేనేజర్‌గా ప్రవీణ్

కాటారం, జూన్ 24:మండలకేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాటారం బ్రాంచ్ మేనేజర్‌గా ఇటీవల బదిలీపై వచ్చిన ప్రవీణ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల వరకు ఎస్బీఐ మేనేజర్‌గా పనిచేసిన వెంకన్న నెక్కొండకు బదిలీ కాగా ప్రవీణ్ హైదరాబాద్ నుంచి కాటారం బ్రాంచ్‌కు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌ను బ్రాంచ్ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి


మహేష్ రాజమౌళి మృతదేహం

మొగుళ్లపల్లి, జూన్ 24: ఇంటి సమీపంలో ఉన్న మంచినీటి బావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని ఆకినపల్లిలో జరిగింది. స్థానిక ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని మహేష్ రాజమౌళి(40) వ్యవసాయ కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల ఇదే గ్రామంలోని తన చిన్నాన్న భిక్షపతి ఇటీవల మృతిచెందగా ఆ కార్యక్రమానికి హాజరై మద్యం సేవించాడు. కాగా, రోజువారీగా తన ఇంట్లో నిద్రించి అర్ధరాత్రి సమయంలో లేచి ఇంటి ఆవరణలో ఉన్న చేదబావి వద్దకు వెళ్లి నీళ్ల తోడేవాడు. ఈక్రమంలో ఆదివారం రాత్రి నీరు తోడుతుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. సోమవారం ఉదయం మహేష్ రాజమౌళి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు వెతకగా బావిలో మృతిచెంది ఉన్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

భర్త వేధింపుల వల్లే కార్యదర్శి ఆత్మహత్య

పోలీసుల విచారణలో ఆలస్యంగా వెలుగులోకి

గణపురం, జూన్ 24: మండలంలోని కర్కపల్లి గ్రామపంచాయితీ కార్యదర్శిగా పని చేసిన పల్లెబోయిన శ్రావణి (34) రెండు నెలల క్రితం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. అయితే మృతురాలు తండ్రి పల్లెబోయిన సాంబయ్య తన కూతురు మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో విచారణ చేపట్టిన పోలీసులు ఆసక్తికర విషయాలు సోమవారం సాయంత్రం వెల్లడించారు. మృతురాలు జీపీ కార్యదర్శి శ్రావణి, భర్త నరేష్‌లు మండలంలోని గాంధీనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటూ కర్కపల్లి కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తుండగా భర్త ఓ ప్రవేటు ఉద్యోగం చేస్తుండేవారని తెలిపారు. అయితే నరేష్ పలుమార్లు అదనపు కట్నం కోసం వేధించాడని ఈ క్రమంలోనే వేధింపులు భరించలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని విచారణలో తెలిసిందని ఎస్సై సాంబమూర్తి తెలిపారు. నరేష్‌ను అరెస్టు చేసి పరకాల కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలి


సింగరేణి జీఎం హబీబ్‌హుస్సేన్

కాకతీయఖని, జూన్ 24: సింగరేణి సంస్థలో నూతనంగా చేరిన ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ సయ్యద్ హబీబ్‌హుస్సేన్ అన్నారు. సోమవారం స్థానిక జీఎం కార్యాలయంలో 41మందికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో యువ కార్మికశక్తి పెరుగుతుందన్నారు. క్రమశిక్షణతో పనిచేస్తు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి కృషిచేయాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగం రావడం అదృష్టంగా భావించి సంస్థ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు జ్యోతి, తుకారాం, గుండు రాజుయాదవ్, శ్యామ్‌ప్రసాద్, మౌనిక, కార్మిక సంఘాల నాయకులు మోటపలుకుల రమేష్, జోగ బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకును సింగరేణికి కేటాయించాలి

కాకతీయఖని, జూన్ 24: మంచిర్యాల జిల్లా శావణపల్లి బొగ్గు బ్లాకును వేలంలో పెట్టకుండా సింగరేణి సంస్థకు అప్పగించాలని సీపీఎం భూపాలపల్లి జిల్లా కార్యదర్శి సాయిలు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే నాలుగు బొగ్గు బ్లాకులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న బొగ్గు బ్లాకులను ప్రైవేటు పరం చేస్తే సంస్థ ఇంకా బలహీన పడుతుందని, సింగరేణిపై ఆదారపడి జీవిస్తున్న వారు ఇబ్బందులు పడుతారని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పాలంపేటలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వెంకటాపూర్(రామప్ప), జూన్ 24: మండలంలోని పాలంపేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పాలంపేట హైస్కూల్‌లో 2006-07లో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, దుర్గం సూరయ్య, సబ్బెన రవీందర్, నర్మద, శోభారాణి, శారద, పూర్వ విద్యార్థులు ఎలగొండ సుభాష్, మార్కండేయ, చిరంజీవి, రమేష్, నిజామొద్దీన్, నరేష్, సందీప్, గంధం మహేందర్, కవిత, సుస్మిత, మాధవి, మమత, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల విరాళం

మల్హర్: మండల కేంద్రమైన తాడిచర్ల ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు సోమవారం విరాళం అందించారు. పాఠశాలలో 1994-95 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాల అభివద్ధి కోసం రూ 15,116లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్కా భాస్కర్‌రావుకు అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొడిమ్యాల బాస్కర్, గర్రెపల్లి రమేష్, వేముల సదానందం, కుంట సది, పైడాకుల సంపత్, బూర్ల శ్రీనివాస్, బండి రాజశేఖర్, బొంతల రాజు, పులిగంటి రామన్న తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండాను అంతం చేయడం ఎవరి తరం కాదు

కాకతీయఖని, జూన్ 24: ఎర్రజెండాను అంతం చేయడం ఎవరి తరం కాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజేందర్ అన్నారు. సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ రాజకీయ శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈసందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ ఎర్ర జెండాలను రూపు మాపేందుకు ఎందరో భూస్వాములు, సామ్రాజయ వాదులు, పెట్టుబడి దారులు అనేక ప్రయత్నాలు చేశారని, అయితే అది ఎవరికీ సాధ్యపడలేదన్నారు. సమాజంలో దోపిడి ఉన్నంత వరకు శ్రమకు దగ్గ ఫలితం రానంత వరకు ఎర్ర జెండా పేదలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మహేందర్, రాజయ్య, రమేష్ పాల్గొన్నారు.

గొత్తికోయగూడెంలో వైద్యశిబిరం

వెంకటాపూర్(రామప్ప), జూన్ 24: మండలంలోని బూర్గుపేట గ్రామశివారులోని అటవీ ప్రాంతంలో గల ఊట్లతోగు గొత్తికోయగూడెంలో సోమవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ 118మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేయడంతోపాటు 29మంది నుంచి రక్తనమూనాలు సేకరించి టీకాలు వేశారు. ఈ శిబిరంలో సీహెచ్‌వో సదానందం, హెల్త్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, ఏఎన్ఎంలు అనురాధ, వజ్రమ్మ, ఆశా కార్యకర్తలు రజిత, కవిత, వినోద పాల్గొన్నారు.